# భా...వా

పురోహితులు వేదమంత్రాలు వల్లిస్తుండగా మేళ, తాళాల చప్పుళ్ళ మధ్య కళ్యాణి పెళ్ళి కార్తీక్‌తో ఘనంగా జరిగింది.

పెళ్ళి నంబరం ముగిసింది.

భర్తా, బంధువులతో కలిసి మెట్టినింటికి రావడంతో పెళ్ళి వేడుకలన్నీ దాదాపుగా పూర్తయ్యాయి. ఇక ముందుంది మురళ్ళ పండుగ అదే.

శోభనం వేడుక.

దానికి ముహూర్తం ఆ రాత్రిగా నిర్ణయించబడింది.

ఆ రోజు ఉదయమే కళ్యాణికి తలంటి పోశారు. సాంబ్రాణి ధూపం వేశారు. ఆమె కిష్టమైన పిండి వంటల ఫలహారం పెట్టారు.

సహజంగా దిద్ది తీర్చిన కుందనపు బొమ్మలా అందంగా ఉండే కళ్యాణి ఆ రోజు తుమ్మెద రెక్కల వంటి విరబోసిన కురులతో విరబూసిన గులాభీలా మరింత అందంగా కనిపించసాగింది.

ముందుగా గదిలోని సోఫాలో "మయూరి" తిరగేస్తూ కూర్చుంది కళ్యాణి. ఆమె అంతరంగమంతా తీయని తలపులతో నిండిపోయి ఉంది.

"శోభనం" అన్న మాటలో, ఎన్నెన్ని మధురానుభూతులు దాగి వున్నాయో!?

కొత్తగా పెళ్ళైన, పెళ్ళికానున్న యువతీ యువకులందర్నీ మధురమైన దివ్యానందానికి బందీని చేసే శక్తి దాని స్వంతం.

ఇన్నాళ్ళుగా తను వలపులు వికసించాలని మనసు లు పరిమళించాలని, తనువులు పరవశించాలని ఆసక్తితో ఆశగా ఎదురుచూస్తున్న

తొలిరాత్రి...మరో ....ఆరేడుగంటల్లో....

తనకు తెలియకుండానే తన చెంపలు కెంపులౌతున్నట్లుగా కళ్ళు ఆశ్చర్యంతో విశాలమై రెపరెపలాడుతున్నట్లుగా గమనించిన ఆమె తనలో తానే చిన్నగా విరిసీ విరియని లేత గులాబీవంటి నవ్వు నవ్వుకుంటూ ఆలోచించసాగింది.

అక్కడ తన కెదురుగా మల్లెలతో అలంకరింపబడ్డ పందిరిమంచం దానిపై నవమన్మధుడిలా వెలిగిపోతూ.

కార్తీక్.

తాను పెళ్ళి పాలగ్లాను టీపాయ్‌పై పెట్టి వంగి, అతని కాళ్ళకు నమస్కరిస్తుంది. రెండు చేతులతో తనను పైకి లేపి తన కళ్ళలోకి చూస్తూ.

"కళ్యాణీ" అంటాడతను.

బదులుగా తనంటుంది.... ఏమని!?

ఔను బదులుగా తనేమని అంటుంది అప్పుడే కాదు తర్వాతకూడా తన్నేమని పిలవాలి? ఈ కాలంలో కొత్తగా పెళ్ళైన వాళ్ళంతా తమ భర్తల్ని ఎలా పిలుస్తున్నారు?

ఏమో!

తానెప్పుడూ విన్నట్లుగా గుర్తులేదు! కలగా పులగంగా సాగుతున్నాయి కళ్యాణి ఆలోచనలు.

"ఏమండీ" అని పిలిస్తే ఎలా ఉంటుంది.

ఉహు! బాపుండదు.... అమ్మ పిలిచినట్లుగా ఉంటుంది.

"స్వామీ" అని పిలిస్తే?

అమ్మమ్మల కాలంనాటి మాట అసలే బాపుండదు.

పైగా,

ఏ సన్యాసినో పిలిచినట్లుగా ఉంటుంది.

మరి.

"శ్రీవారూ" అని పిలిస్తేనో?

ఊహు ఈ పిలుపు కృత్రిమంగా ఉంటుందేమో!? పోనీ.

'డియర్" అని పిలిస్తే!?

అమ్మో! ఇంకేమైనా ఉందా! ఎవరైనా వింటే ఎంత ఎగతాళి చేస్తారు.

ఎలా పిలవాలి చెప్మా?.... ఓ కొలిక్కి రాకుండా సాగుతున్నాయి కళ్యాణి ఆలోచనలు.

కళ్యాణి ఆలోచనల్ని గమనించలేకనో కార్తీక్‌లోని ఆతృత చూడలేకనో తెలియదు కానీ సూర్యుడు యధాలాపంగా పడమటి కొండల వెనక్కి జారుకున్నాడు.

"బాత్రూంలో వేణ్ణీళ్ళు పెట్టాను త్వరగా వెళ్ళి స్నానం చేయండమ్మా"

పని మనిషి మాటలకు ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చిన కళ్యాణి లేచి గబగబా బాత్రూంకేసి నడిచింది.

బాత్రూంలో దూరిన ఆమెని మళ్ళీ చుట్టుముట్టాయి ఆలోచనలు. ఆమె వదనాన్ని ముద్దాడిన భాగ్యానికే మురిసి కరిగి పోతుంది లిరిల్‌సబ్బు.

తళుక్కున మెరుపులా మెరిసింది ఓ ఆలోచన ఆమె తలలో

అలా పిలిస్తే?.... తప్పేముంది!?

ఏమీ లేదు. పైగా.

బ్రహ్మాండంగా ఉంటుంది కూడాను కానీ... తానలా పిలవగలదా? పిలవాలి, తప్పదు...

ఏమైనా సరే, భయపడకుండా అలాగే పిలవాలని ధృడంగా నిశ్చయించుకున్న కళ్యాణి ఉత్సాహంగా స్నానం ముగించింది.

రాత్రి తొమ్మిది గంటల సమయం.

గ్లాసులో పాలనూ తన ముద్దుమురిపాలనూ నంపుకొని అంతరంగమంతా ఆనంద తరంగాల్లో తేలియాడుతుండగా మంద గమనంతో మయూరిలా—పయ్యారంగా శోభనపు గదిలోకడుగు పెట్టింది కళ్యాణి.

ఎదురుగా.

తనూహించినట్లుగానే మల్లెపూలతో అలంకరించుకున్న పందిరి మంచం.

దానిపై నవమన్మధుడిలా కార్తీక్.

మల్లెల సువాసనతో జతకలిసిన అగరుబత్తుల పరిమళం ఆ గదంతా నిండు కొని ఉంది.

ఎస్.ఎస్.రాజు



అందెలు చిరునవ్వడితో అల్లరి చేస్తుండగా నడచి వెళ్ళిన కళ్యాణి పాలగ్లాసును టీపాయ్‌పైనుంచి వంగి ఆమె కళ్ళలోకి చూస్తూ.

"కళ్యాణి" అన్నాడు ప్రేమ నిండిన స్వరంతో.

"బావా" అంది కళ్యాణి తనూ ప్రేమ నింపుకున్న స్వరంతో,

ఆమె పిలుపుకు ఉలిక్కిపడ్డాడు కార్తీక్.

"బావా!?! ఇదేమిటి.... అక్కమొగుణ్ణి పిలిచినట్లుగా!?" అన్నాడు... అప్రయత్నంగా.

అతని చేతులు ఆమె భుజాల్ని వదిలివేయగా ఆమెకు అంత దగ్గరగా నిలువలేక రెండడుగులు వెనక్కి తగ్గాయి కార్తీక్ కాళ్ళు.

"ఔను! నా కన్నా ముందు కట్టుకుంది మా అక్కనే కదా?" నిశ్చలంగా అంది కళ్యాణి.

ఆమె మాటలకు అప్రతిభుడై నోరు తెరచి అలా చూస్తుండిపోయాడు కార్తీక్.

"ఔను బావా మా అక్క లక్ష్మిదేవి.... అదే... డబ్బు....

లక్ష రూపాయలు కట్నం పుచ్చుకునే కదా నా మెళ్ళో మూడు ముళ్ళూ వేసింది."

అమాయకంగా కళ్ళు త్రిప్పుతూ అంటున్న కళ్యాణి మొహంలోకి చూడలేక లజ్జాభారంతో తల దించుకొని నిలబడి పోయాడు కార్తీక్.

ఉరఫ్... కళ్యాణి భావా- ●